# మనిషికీ మనిషికీ మధ్య...

ఆడిటర్ల యక్షప్రశ్నలకి సమాధానాలు 'చూపించి' వాళ్ళని సంతృప్తిపరిచేసరికి తలప్రాణం తోక కొచ్చింది. గుడ్ బై చెప్పి ఆఫీసులోంచి బయటపడ్డాను. లిఫ్ట్ తిరగట్లేదు. టైము చూశాను. తొమ్మిదీ నలభై.

'బాపురే!' చిన్నగా అరచి గబగబా మెట్లమీంచి దిగాను.

బయట చిమ్మచీకటి. హెూరున కురుస్తోన్న వర్షం.

వెన్ను జలదరించింది. నోటి తడారిపోతుంటే దిగులుగా చూశాను. రోడ్డుమీద వాహనాల రద్దీ పలచబడింది. ఇప్పుడు ఒంటరిగా ఇంటికెలా వెళ్ళడం ?

ఇది మహానగరమే కాదు జనారణ్యం కూడానూ. ఆడది అర్ధరాత్రి ఒంటరిగా ఆటోలో వెళ్ళగలదని 'స్వర్ణభారతి' సాక్షిగా చెప్పలేని పరిస్థితి!

మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోవడం మంచిదికాదన్పించింది.

తడుస్తూనే షాపుల పక్కనుంచి నడుస్తూ బస్టాపు కెళ్లాను. లక్కీగా రూటు బస్సొస్తే ఎంత బావుణ్ణు! ఆశగా చూస్తున్నాను.

ఆత్రం, ఆందోళనా క్షణక్షణానికీ పెరిగిపోతున్నాయి.

బస్సు వెంటనే దొరికితే ఎర్రగడ్డ వెళ్లడానికి ఎంత లేదన్నా అరగంట పడుతుంది. అక్కడ బస్సు దిగి మళ్ళీ లోపలికి–ఓ అరకిలో మీటరు దూరం నడవాలి. దారిలో అటూ ఇటూ చెట్లూ గార్డెన్లూ తప్ప ఇళ్ళు వుండవు. చీకటి పడితే జనసంచారమూ వుండదు!

పిచ్చి పిచ్చి ఆలోచనలు బుర్రని నంజుకు తినేస్తున్నాయి.

నాకు దగ్గర్లో ఎవరో నిలబడినట్టనిపించి అటు చూసి ఉలిక్కిపడ్డాను.

నిశ్శబ్ధంగా వచ్చి నిలుచున్నాడో నడి వయస్సతను. కొంచెం ఎడంగా జరిగి బస్సు కోసం చూస్తూ ఆడిటర్లని తిట్టుకుంటూ మాటిమాటికీ టైము చూసుకుంటూ తలకిందులైపోసాగాను.

ఎప్పుడూ లేంది కన్నీళ్ళు కూడా వచ్చేస్తున్నాయి !

ఈసారికెలాహోలా క్షేమంగా ఇల్లు చేరితే అంతే చాలు. ఇంకెప్పుడూ చచ్చినా ఇంతాలస్యం అవ్వనీను....

అరె! పదీ ఇరవై!! ఉద్వేగంతో ఊగిపోతూ సరిగ్గా నిలవలేకపోతున్నాను.

"హలో" అన్నాడతడు పలకరింపుగా నవ్వుతూ. నేను తల తిప్పేసుకున్నాను. ఒంటరి ఆడదాన్నని కాకపోతే పలకరించాల్సిన అవసరం ఏమిటో తనకి !

"నేనూ లిబర్టీ ప్లాజాలోని ఆఫీసులోనే పనిచేస్తున్నానండీ. సెకండ్ ఫ్లోర్....

నాకెంతో రిలీఫ్‌గా అన్పించింది. సముద్రంలో కొట్టుకుపోతున్నవారికి చిన్న నావ లభ్యమైనంత ఆనందం కలిగింది. అతడి వంక పరిశీలనగా చూశాను. చూసిన మొహంలా అన్పించలేదు.

"మిమ్మల్ని లిఫ్ట్‌లో చాలాసార్లు చూశాను...."

నాకు మాత్రం గుర్తురాలేదు. అయితేనేం అతడు తెలుసంటున్నాడు గనుక కొంచెం ధైర్యంగా అన్పించింది.

"ఆఫీసులో లేట్ అయిపోయిందండి. ఏవిటో ఒక్క బస్సూ రావట్లేదు" బస్సు కోసం కలయజూస్తూ అన్నాను.

"ఆర్టీసీలోని ఒక యూనియన్‌వాళ్ళు స్ట్రయిక్ చేస్తున్నారండి. అంచేత కొన్ని బస్సులే తిరుగుతున్నాయి"

"మై గాడ్! ఇప్పుడెలా ?"

"మీరెక్కడికెళ్ళాలి?"

"ఎర్రగడ్డ. ఆల్విన్‌భవన్ పక్కనుంచి కొంచెం లోపలికెళ్ళాలి"

"అలాగా. మా ఇల్లూ అక్కడే. సాయి టెంపుల్ దగ్గర...."

నాకెక్కడలేని ధైర్యమూ వచ్చేసింది. నేను పనిచేస్తోన్న బిల్డింగులోనే పనిచేస్తున్నాడు. నివాసం కూడా మాకు దగ్గర్లోనే. మా అపార్ట్‌మెంట్ ముందు నుంచే అతడు వెళ్లాలి.

అతడెంతో ఆప్తుడిగా అన్పించాడు.

అటుగా వెళ్తున్న ఆటోని పిలిచి, "రండి వెళ్దాం" అన్నాడు.

ఒక్క క్షణం తటపటాయించాను. అతడు వెళ్ళిపోతే నా పని మరీ ఘోరమై పోతుందనిపించింది. సంశయిస్తూనే ఎక్కి కూర్చున్నాను. ఆటో దూసుకుపోతోంది.

ఒకవేళ ఇతనూ ఆటో డ్రైవరూ తోడుదొంగలేమో! కావాలని నాటకమాడుతున్నారేమో!

ఏవేవో భయాలు బుసలు కొడుతోంటే ఎడంగా జరిగి ముడుచుకుని కూర్చుని బయటికి చూశాను.

ఆటో మెయిన్‌రోడ్డే వెళ్తోంది. ట్రాఫిక్ బాగానే వుంది. నిట్టూర్చాను.

చల్లగాలి వీస్తోంది. వర్షపుజోరు తగ్గినా చినుకులు పడుతూనే వున్నాయి. మధ్య మధ్య అవి నన్ను తడుపుతూనే వున్నాయి. అయినా నా ఒళ్లంతా ముచ్చెమటలు పోస్తోంది!

ఆటోనూ అపార్ట్‌మెంట్ ముందాగింది. చెప్పలేనంత ఆనందం కలగ్గా చెంగున దిగాను. "చాలా థాంక్స్"

"నన్ను బస్టాపులో డ్రాప్ చెయ్యవోయ్" అతడన్నాడు ఆటో అతన్తో.

"వెనక్కెందుకు? మీ ఇల్లు ఈపైనే అన్నారుగా?!" అడిగాను.

నవ్వేడతను. "నేను వెళ్ళాల్సింది దిల్‌షుక్‌నగర్. బస్టాపులో మీ స్థితీ, మీ టెన్షన్నీ చూశాక మీకు మానసిక ధైర్యమివ్వడానికి చిన్న అబద్ధమాడాను. బై"

నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. "థాంక్యూ ఫ్రెండ్...." అనాలనుకున్నాను. కానప్పటికే ఆటో వెనుదిరిగింది !

**(స్వాతి సపరివార పత్రిక 8.3.1998)**